# రిలీజైతే హాలీడే

భిక్షపతి ఒక పబ్లిసిటీ పేస్టింగ్ బాయ్. సినిమాకు ప్రాణం పోస్టరు పబ్లిసిటీ అయితే ఆ ప్రాణానికి ఆధారం పేస్టింగ్ బాయిస్. సినిమాకు క్లాపు కొట్టిన నాటి నుంచి పూర్తయి మొదటి కాపీ వచ్చే వరకూ వివిధ పత్రికలలో సినిమా వార్తలు ప్రచురితమయి విజ్ఞులకు విడుదల కాబోయే చిత్రం పరిచయమైతే మొదటి కాపీ వచ్చిన నాటి నుంచి విడుదలయ్యే వరకూ క్లాస్ నుంచి మాస్ వరకూ అన్ని వర్గాల ప్రజలకూ సినిమాను చేరువ చేసేది ఈ పోస్టరు పబ్లిసిటీ మాత్రమే.

సినిమా పోస్టర్లు బోర్డుల మీదా, అనేక గోడల మీదా ఆకర్షణీయంగా కనిపిస్తూ కొన్ని లక్షల మందిని ఆకట్టుకునేలా చేస్తూ విజయానికి తోడ్పడుతున్నాయి అంటే దీని వెనకాల రాత్రనక పగలనక చింకి గుడ్డలతో చేయని నేరానికి శిలువ మోస్తున్న దోషిలా పెద్ద నిచ్చెన మోసుకుంటూ, అట్టలు కట్టిన మైదా చేతులతో పాత డొక్కు సైకిల్ మీద అగమ్యగోచరమైన భవిష్యత్తులోకి పారిపోయే ఈ పేస్టింగ్ బాయ్ కృషి, దీక్షా, సామాన్యుల కెవరికీ అర్థంకాదు, అవసరమూ లేదు.

అంటించే పోస్టరు స్థిరంగా ఉండేందుకు సాధారణంగా రాత్రిళ్ళు మాత్రమే ఈ పేస్టింగ్ జరుగుతుంది. రాత్రిళ్ళు చేసే వృత్తుల్లో శీలాన్ని నిలుపుకోవడం కష్టం. అందుకే ఈ వృత్తిలో ఉన్న అనేక మంది వ్యసనాలకు బానిసలవుతారు. వ్యసనపరుల వద్ద లక్ష్మి నిలవదు. ఇలాంటి వాళ్ళు ఎంత సంపాదించినా నిత్యం దారిద్ర్యంతోనే ఉంటారు.

మృత్యుంజయరావు ఒక సినిమా డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి యజమాని. ఒక పెద్ద నిర్మాత కూడా. వీరు విడుదల చేసే చిత్రాలను పేస్టింగ్ చేసేది భిక్షపతి. తన పదహారో ఏటే తండ్రి ఏక్సిడెంటులో చనిపోగా తల్లి, తమ్ముడి పోషణా భారం లేత భుజాల మీద పడగానే భిక్షపతి ఈ రంగంలో ప్రవేశించాడు. భిక్షపతి సంపాదనకు ఏమీ లోటు లేదు. అయితే తన సంపాదన వల్ల తాను బాగుపడకపోయినా సారా, కల్లు కాంపౌండుల వృద్ధికి ఇతోధికంగా తోడ్పడ్డాడు. ఎప్పుడూ హుషారుగా దడదడ మాట్లాడుతూ ఒప్పుకున్న పనిని చెప్పిన టైంలో శ్రద్ధగా చేయడం భిక్షపతిలో ఉన్న "ప్లస్ పాయింట్". భిక్షపతి పోస్టరు అంటించాడంటే అది నీట్‌గా ఫ్రేమ్‌లో బిగించిన కలర్ ఫోటో అంత అందంగా ఉండవలసిందే. అందుకే భిక్షపతికి పొగరెక్కువ అంటారు కొందరు. అతను ఎవరి వద్దా జీతానికి పని చేయదు. అది తనకు పడదంటాడు. పోస్టరుకి ఇంత రేటు అని కాంట్రాక్టు మాట్లాడుకుని పర్ఫెక్టుగా పని చేసి కరెక్టుగా డబ్బు వసూలు చేస్తాడు.


భిక్షపతిలోని ఈ "క్వాలిటీస్" ను బట్టే అతనికి మృత్యుంజయరావు కంపెనీలో ఉద్యోగం దొరికింది,. మృత్యుంజయరావు అంటే సామాన్యుడు కాదు. సినీ ప్రొడ్యూసర్లలో హీరోలాంటివాడు. సుమారు ముప్పై ఏళ్ళ క్రితం తన ఇరవయ్యో ఏట సినిమా వ్యామోహంతో మద్రాసు రైలెక్కిన మృత్యుంజయరావు అనేక ఢక్కాముక్కీలు తిని ఈ చిత్ర విచిత్రమైన రంగుల హంగుల ప్రపంచంలో బ్రతకడానికి అవసరమయ్యే 'టెక్నిక్‌లు' నేర్చుకుని బాగా డబ్బు సంపాదించాడు. రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఒక్క చూపుతో ఎదుటి మనిషిని 'స్కాన్' చేసి ఆంతర్యాన్ని గ్రహించి అందుకు అవసరమయిన స్టెప్స్ తీసుకునే అతని 'ఇంటిలిజెన్స్' కి అతని వద్ద పని చేసేవారంతా ఆశ్చర్యపోతూ ఉంటారు. మిన్ను విరిగి మీద పడినా ఏ మాత్రం 'టెన్షన్' ఫీలవకుండా సమస్యలను పరిష్కరించుకోవడం మృత్యుంజయరావు "ఫిలాసఫీ". ప్రజల నాడిని పసిగట్టి కొత్త పద్ధతి కనిపెట్టి సినిమాలు నిర్మించి సక్సెస్ చేయడం పరిశ్రమలోని వారందరికీ ఆశ్చర్యమే.

సంక్రాంతి తెలుగు వారికే కాదు తెలుగు సినిమా రంగానికి కూడా పెద్ద పండుగే. అందుకే సాధారణంగా నెలకు అయిదారు సినిమాలు విడుదలైతే జనవరి మొదటి రెండు వారాలలో పది పన్నెండు సినిమాలయినా విడుదలవుతాయి.

సంక్రాంతికి మృత్యుంజయరావు సినిమా కూడా విడుదలవ్వబోతోంది. విడుదలకు కావలసిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. పూర్తి అయిన కొత్త సినిమాను మృత్యుంజయరావు అప్పటికి అయిదారుసార్లు చూశాడు. అతనికి నమ్మకం గల అభిజ్ఞులకూ చూపించాడు. ప్రివ్యూ చూసిన వారంతా ఖచ్చితంగా "హిట్" అని నిర్ణయించారు. మృత్యుంజయరావు మంచి సంతోషంగా ఉన్న సమయంలో రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో అతని 'కోట' లో పర్సనల్ ఫోన్ మోగింది. మద్రాసు నుంచి ప్రొడక్షన్ మేనేజర్ మాట్లాడాడు.

అది జనవరి రెండవ తేదీ. ఉదయం పదిన్నర. సమయంలో మృత్యుంజయరావు సొంత భవనంలోగల అతని డిస్ట్రిబ్యూషన్ ఆఫీసులోని ఎ.సి. గదిలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయబడింది. సింహాసనం లాంటి కుర్చీలో ఉన్న మృత్యుంజయరావు ముందు ఆ కంపెనీ జనరల్ మేనేజర్ దామోదరరావు. పి.ఆర్.ఓ. నిరంజన్ గుండెగుప్పెట్లో పెట్టుకుని వినయంగా కూర్చుని మృత్యుంజయరావు నోట్లోంచి వెలువడే ప్రతిమాటను మైండ్‌లో రికార్డు చేస్తున్నారు. కొన్నింటిని చిన్నబుక్‌లో నోట్ చేస్తున్నారు.

గత రాత్రి మద్రాసు నుండి వచ్చిన అర్జంటు మెస్సేజి ఫలితం ఈ సమావేశం. సరిగ్గా మృత్యుంజయరావుతో సమతూగగల మరో నిర్మాత బాలాజీ. అతను ఈ పండుగకు విడుదల చేయబోయే చిత్రం ప్రివ్యూను గత రాత్రి మద్రాసులో ప్రదర్శించినట్లు సుమారు రెండువందల మంది సినీ మేధావులు ఏకగ్రీవంగా ఆ చిత్రం సూపర్‌హిట్ అని సర్టిఫై చేసినట్లు వచ్చిన వార్త అది. మృత్యుంజయరావు చలించలేదు. నిజంగా సమస్యలు వచ్చినప్పుడే మనిషిలోని క్రియేటివ్ థింకింగ్ బయటపడుతుంది అంటాడు. "ఈ ఏడాది విడుదల అయ్యే సినీమాల మధ్య గట్టి పోటీ ఉంటుంది. ఈ పోటీకి నిలబడి ప్రేక్షకుల దృష్టిని మన చిత్రంమీద నిలిచేలా చేయడం మనవిధి. 'నోడౌట్' మన చిత్రం చాలా బాగా వచ్చింది. అయితే ముందు జనం వచ్చి చూసి బాగుంది అంటేనే కదా. హిట్ టాక్ వచ్చి తరువాత మౌత్ పబ్లిసిటీ ద్వారా కలక్షన్లు పికప్ అయ్యేది. మీకు తెలుసు కదా మన సినీమాకు పెద్ద తారలూ భారీ సెట్టింగులూ ఉండవు కథే మన సినీమాకు ప్రాణం. ఇన్ని రిలీజులవల్ల "ఓపెనింగ్స్' వచ్చేలా మనం చేయలేకపోతే దీన్ని అవకాశంగా తీసుకుని అపోజిషన్



## పెంట్యాల సుబ్బారావు

వాళ్లు బ్యాడ్ ప్రాపగాండా చేస్తారు. ఇంకా అప్పుడు ఏమీ చెయలేం. కనుక ముందుగానే మన చిత్రానికి వెరైటీగా పబ్లిసిటీ చేయ్యాలి. రాష్ట్రంలో మనం రిలీజు చెయ్యబోయే ప్రతి సెంటర్లలోనూ ఎక్కడ చూసినా మన సినీమా పబ్లిసిటీ కనిపించాలి. "పబ్లిసిటీ మీడియాను పోసనపట్టిన మృత్యుంజయరావు మాటల్ని ఎంతో ఆశ్చర్యంగానూ, శ్రద్ధగానూ వింటున్నారు. జి.ఎమ్, పి.ఆర్.ఓ. లు.

"....బాగాల పబ్లిసిటీ చెయ్యాలంటే ఎక్కడ పడితే అక్కడ గోడలకు పోస్టర్లు అంటించడం కాదు. దాని వల్ల బోల్డు డబ్బువృధా. అంతేకాదు మర్నాడు మరో పోస్టరు దానిమీద అంటిస్తే దాని లైఫ్ పీరియడ్ క్లోజ్ కనుక తక్కువ పెట్టుబడితో ఎక్కువ పబ్లిసిటీ అయ్యే ఉపాయం చెబుతాను...." నా దగ్గరకు పిక్చర్ ఆల్బమ్స్ పంపిస్తే ట్వంటీఫోర్ పోస్టర్లు కోసం కొన్ని ఫోటోలు నెంబర్లు నోట్‌చేసి ఇస్తాను. మీరు ఆర్టిస్టుతో ఆ ఫోటోలను కావలసిన సైజులో ఫోటోయూనిట్‌లో ప్రింట్లు చేయించుకోమని చెప్పి, మంచివెరైటీ డిజైన్లు తయారుచేసి నాకు చూపించండి. నేను

ఒకే చేసిన తరువాత ట్వంటీఫోర్ షీట్సు ప్రింట్ చేయించండి. మనం రిలీజుచేసే అన్ని సెంటర్లలో గల పెద్దపెద్ద హోర్డింగుల లిస్టు తయారుచేసి వాటిలో లోకేషన్స్ బట్టి జనాభా బట్టి చూసి మొత్తంమీద రెండువందల బోర్డుల వరకు ఒక నెలకు రెంట్‌కు కాంట్రాక్టు తీసుకుని వాటి మీద ఆకర్షణీయంగా వాటిని పేస్టింగ్ చేస్తే జనాన్ని ఆకట్టుకుంటాయి. ఫ్యూయర్ షిప్ పెరగడం వల్ల మంచి పబ్లిసిటీ జరిగి జనం రావడానికి అవకాశముంది. దామోదరం, రామారావులు రెప్పవాల్చటం మరిచిపోయి వింటున్నారు.

...“ఈ ఏర్పాట్లన్నీ వారం రోజుల్లో పూర్తవ్వాలి. అంతా యంత్రాల్లా పనులు చెయ్యాలి. ఈ రోజు రెండవ తేదీ ప్లాన్డ్‌గా చేస్తే పనులన్నీ సకాలంలో పూర్తి చెయ్యవచ్చు. ఎనిమిదవ తేదీ సాయంత్రానికి అన్ని సెంటర్లకు పోస్టర్లు డిస్పాచ్ అయిపోవాలి. కనీసం ఉదయానికి అన్ని సెంటర్లలోనూ మనసినిమా పబ్లిసిటీ కొట్టొచ్చినట్లు కనబడాలి....” కొండంత బరువును జి.ఎమ్.పి.ఆర్.ఓ.ల మీద వదిలేసి తన మారుతీ ఎస్టీమ్‌లో మెత్తగా వెళ్ళిపోయాడు మృత్యుంజయరావు.


మరుక్షణం నుంచి ప్రారంభమైంది ఆ ఆఫీసులో సంచలనం. అవి మృత్యుంజయరావు మాటలుకావు. శిలాశాసనాలు ఈ వారం రోజులూ ఆర్ట్ డిపార్ట్‌మెంటు, ఫోటోయూనిట్, పబ్లిసిటీ సెక్షన్, పబ్లిషర్స్ అందరూ నిలబడి నీళ్ళుతాగకుండా రాత్రింబవళ్ళు అష్టకష్టాలు పడి అనుకున్న పని పూర్తి చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని మృత్యుంజయరావుకు తెలియజేస్తూ ఉన్నారు. అందరి కృషివలన అకుంఠిత దీక్షవలన ట్వంటీఫోర్ షీట్స్ అద్భుతంగా రూపుదిద్దుకున్నాయి. కాంపౌండ్‌లో నేలమీద పరచిన ఇరవైనాలుగు ముక్కల కలయికతో ఏర్పడిన పోస్టర్లు, వేల ఖర్చుతో తయారుచేసే ఆయిల్ ప్రింటు కటవుట్‌లను మరపిస్తున్నాయి. ఇంక మిగిలినది పోస్టర్ల పేస్టింగ్. దీని మీదే మొత్తం ఆధారపడివుంది. సకాలంలో పేస్టింగ్ జరగకపోతే పడిన శ్రమఅంతా వృధా!

పి.ఆర్.ఓ. నిరంజన్ స్కూటర్ ఇరుకు గల్లీలో ఉన్న బిక్షపతి ఇంటిముందు ఆగింది. బిక్షపతిని అర్జంటుగా ఆఫీసుకు రమ్మని చెప్పి వెళ్ళిపోయాడు నిరంజన్. ఆఫీసుకు వచ్చిన బిక్షపతి ఈ పోస్టర్ల పేస్టింగ్ విషయం విని తనకు ఈ ఏడాదే పెళ్ళయ్యిందని, అత్తవారింటికి వెళ్ళాలని కుదరదని చెప్పాడు. చివరకు జి.ఎం. తన రూమ్‌లోకి పిలిచి, తప్పదని చెప్పడంతో ఆలోచనలోపడ్డాడు. ‘ట్వంటీఫోర్ షీట్ పేస్టింగ్ అంటే మాటలు కాదు— ఒక్కో పోస్టరుకు గంటపైనే పడుతుంది. ఒక్క పోస్టరుకి ఏభై రూపాయలు పేస్టింగ్ చార్జి, సిటీలో మొత్తం ఇరవై అయిదు హోర్డింగ్‌లు లిస్టులో ఉన్నాయి. శ్రద్ధగా పనిచేస్తే మూడు రోజుల్లో పని పూర్తి చెయ్యవచ్చును. అంటే మూడు రోజులలో పన్నెండు వందల ఏభై రూపాయలు. బిక్షపతికి వెంటనే కొత్త పెళ్ళాం కోరిన పట్టుకోక గుర్తుకొచ్చింది. మారు మాట్లాడకుండా బిక్షపతి పనికి ఒప్పుకున్నాడు.

‘ఏవిట్రా వినయ్! మీడాడీ ఆఫీసుకు టైం అవుతుందనా నిలబడి టిఫిన్ చేస్తున్నాడు’ అని అడిగాడు శ్రీను.

అదేం కాదురా ‘కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయని’ నిల్చుని తింటుంటాడు చెప్పాడు వినయ్.

ఎం.రాంబాబు,
పులివెందుల



తాను తరువాత వస్తానని భార్యను ముందుగా పుట్టింటికి పంపించేశాడు బిక్షపతి.

మూగరాముల్ని తోడుగా తీసుకుని, పెద్దనిచ్చెన, ఉడికించిన మైదా బక్కెట్టు సైకిలుకి కట్టుకుని రాత్రి పది గంటల వేళ బయల్దేరాడు బిక్షపతి చల బాధ తెలియకుండా ఓ బీడీ కట్టను వెచ్చగా జేబులో ఉంచుకున్నాడు. ఎత్తైన బోర్డులపైకి నిచ్చెన మీదుగా ఎగపాకి మూగరాములు మైదా పూసి ఇస్తున్న ఒక్కొక్క ముక్కనూ ముడతలు రానీ కుండా— కలుపుకుంటూ అందంగా అంటిస్తున్నాడు. దుమ్ముకొట్టుకుపోయి, ఎండి అట్టలు కడుతున్న బిక్షపతి చేతుల్లోంచి రూపుదిద్దుకుంటున్న ‘ట్వంటీఫోర్’ పోస్టర్లు మనోహరంగా ముస్తాబవుతున్నాయి.

రెండు రోజుల్లో మూడు వంతుల పని పూర్తి చేశాడు బిక్షపతి. నగరంలోని ముఖ్యమైన సెంటర్లలో బిక్షపతి అంటించిన పోస్టర్లు బోర్డుల మీద సెర్చిలైట్లలా మెరిసిపోతూ కన్నుల పండుగగా ఉన్నాయి. మూడవరోజు ఉదయం బిక్షపతి ఆఫీసుకెళ్ళి పూర్తి చేసిన పని తాలూకు డబ్బు తీసుకుని ఆ రాత్రి అందులో ఓ వందపెట్టి చవక రకం బ్రాంది పట్టేసి, బిర్యాని కొట్టేసి మూగరాములుతో కలసి హుషారుగా పేస్టింగ్‌కు బయల్దేరాడు. చకచక అతిలాఘువంగా పోస్టర్లు అంటిస్తున్నాడు. నగరంలో మంచి సెంటర్లో చాలా ఎత్తులో ఉన్న హోర్డింగ్ అది. బిక్షపతి నిచ్చెన పై మెట్టు మీద నుంచుని పోస్టరు అంటిస్తున్నాడు. రాములు తరువాత ఇవ్వవలసిన పోస్టరుకు మైదా పూస్తున్నాడు. అప్పుడు తెల్లవారుజాము నాలుగవుతోంది. అదే చివరి బోర్డు, బిక్షపతి కళ్ళు అగ్నిగోళాల్లా ఉన్నాయి. గత రెండు రోజులుగా పడిన శ్రమ, తాగిన మందు బిక్షపతి మీద తమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. బిక్షపతి కిందకు వంగి పోస్టరు అందుకోబోతున్నాడు. అతనికి ఒక్కసారి కళ్ళు తిరిగినట్లయ్యింది. నిచ్చెన చేతిపట్టు జారిపోయింది. అంతే మరుక్షణం. వంద కాకర పువ్వొత్తులు ఒక్కసారి వెలిగించినట్టు చిటపట చప్పుళ్ళతో విద్యుత్ వెలుగులు వెదజిమ్మడం ఓ పెద్ద పొలికేక వినిపించడం ఒక్కసారే జరిగాయి. కరెంటుపోయింది. గాఢాంధకారంలో మూగరాములు ఒక్కసారి తిమ్మెరపోయాడు. అతని అరికాళ్ళలో చెమటలు పట్టాయి. నెమ్మదిగా తేరుకుని వణుకుతున్న చేతులతో అగ్గిపుల్ల వెలిగించాడు. రాములు కళ్ళు తిరిగిపోయాయి. డ్రైనేజి ప్రక్కన రక్తసిక్తమైపడిఉన్నాడు బిక్షపతి.

★ ★ ★

సిటీలో మహాత్ముని పేరుగల ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు బిక్షపతిని. అదొక ప్రత్యక్ష నరకం. విద్యుత్ తీగల మీదకు పడడం వలన బిక్షపతి వళ్ళంతా కాలిపోయింది. చాలాఎత్తు మీద నుంచి పడటం వలన అతని వెన్నెముక విరిగిపోయింది. ఫలితంగా నడుము క్రింది భాగమంతా చచ్చుబడిపోయింది.

మృత్యుంజయరావు సినిమా పన్నెండున విడుదలై మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. మంచి టాక్ వచ్చి సినిమా హిట్టయ్యింది. బిక్షపతికి జరిగిన ఘోర ప్రమాదం మృత్యుంజయరావు చెవులబడింది. సాధారణంగా ‘బిజినెస్ మాగ్నట్లు’, ‘సెంటిమెంట్ల’కు అతీతులు. విషయం తెలిసిన మృత్యుంజయరావు “అరె పాపం... రెండు మూడు వందలు వైద్య సహాయానికి ఇవ్వకపోయారా? అన్నాడు. అంటే బడ్జెట్ నిర్ణయించాడన్నమాట.

ఆసుపత్రిలో బెడ్డులేని కారణంగా బిక్షపతిని వరండాలో పడుకోపెట్టారు. సరైన మందులులేని ఆసుపత్రిలో డబ్బు దక్షతలేని బిక్షపతి, ఇరవై రోజులు ప్రత్యక్ష నరకం అనుభవించి ధర్మాసుపత్రి దరిద్రాన్ని వదుల్చుకున్నాడు.

మర్రిచెట్టు లాంటి సినిమా పరిశ్రమలో పిల్ల వేరులాంటి బిక్షపతి, అఫ్టాల్ ఓ పేస్టింగ్ బాయ్ ఏమైపోతే ఎవరికి కావాలి?

మృత్యుంజయరావు మరో కొత్త సినిమా పూర్తయ్యింది. బిక్షపతి చనిపోయాక అతని పని కోసం ఎందరో పేస్టింగ్ బాయిస్ ఎగబడ్డారు. చివరకు ఎలాగో కాళ్ళా వేళ్ళాపడి ఓ పదహారేళ్ళ కుర్రాడు కొట్టేశాడు.

రాత్రి పది గంటల సమయంలో చిరుగుల కాకీ నిక్కరుతో నిచ్చెన మైదా బక్కెట్టు తీసుకుని పోస్టర్ల పేస్టింగ్ కోసం చీకట్లో కలిసిపోతున్నాడు పదహారేళ్ళ రాఘవ, అదే బిక్షపతి తమ్ముడు. వారి కుటుంబానికి అతడేగా ఇప్పుడు ఆధారం. ●